# శ్రీ రమణ జ్యోతి

సంపుటి-44 సంచిక - 11 హైదరాబాదు నవంబరు, 2024 పేజీలు - 52 రూ. 10/- సంవత్సర చందా : రూ. 100/-

# SRI RAMANA JYOTHI

Vol - 44 Issue - 11 Hyderabad November, 2024 Pages - 52 Rs. 10/- Annual Subscription Rs. 100/-



**BHAGAVAN SRI RAMANA MAHARSHI**



*ARUNACHALA HILL* (అరుణాచల గిరి)

స్మరణమా త్రముననె పరముక్తి ఫలద । కరుణామృ తజలధి యరుణాచ లమిది ॥

శ్రీ రమణ జ్యోతి

నవంబర్ 2024

**Sri Ramana Jyothi**

November 2024


ఈ సంచికలో ...

IN THIS ISSUE ...


| | | | |
|---|---|---|---|
| **1.** | **డా॥ కే.యస్. గారి 123వ ప్రవచనం** | డా॥ వి. రామదాస్ మూర్తి | 3 |
| **2.** | **శ్రీరమణ మహర్షి యొక్క భక్తాగ్రేసరులు** | శ్రీమతి మల్లాది ఫణిమాల | 10 |
| **3** | **సి.వి. సుబ్రహ్మణ్య అయ్యర్** | సరోజా ప్రసాద్ | 16 |
| **4.** | **ఇద్దరు మహాత్ములు భగవాన్‌ను కలిసిన వేళ విశ్వనాథ స్వామి॥** | శ్రీ రవికృష్ణ శర్మ | 19 |
| **5.** | **భగవాన్‌తో జంతు భక్తులు** | వి. రమేష్ బాబు | 22 |
| 6. | Money, Work and Happiness | Dr K Subrahmanian | 30 |
| 7. | Ashtavakra Gita 30 | V Krithivasan | 40 |
| 8. | Light Dialogues | SS Cohen | 43 |
| 9. | Keerai Patti, the first 'mother' to cook for Bhagavan on a regular basis | Sneha Choudhury | 45 |


**Events in Sri Ramana Kendram in November 2024**

1. Satsang - Every Sunday - 9.00 - 10.45 a.m.
3. 20th - Punarvasu Satsang - 6.30 - 7.30 p.m.
4. 3rd Sunday - Meditation - 9.00 - 10.45 a.m.

(పాఠకులు దయచేసి తమ ఫోన్ నంబరు,e- మెయిల్ అడ్రెస్, శ్రీ రమణకేంద్రం ఆఫీసుకు వెంటనే ఫోన్ చేసి తెలియజేయగలరు)

(Readers are requested to kindly intimate the Sri Ramana Kendram Office, their Phone Number and e-mail address)


© Copyrights of all the material used from Sri Ramanasramam publications in Sri Ramana Jyothi either in excerpted form, translated form or serialised form totally belong to Sri Ramanasramam, Tiruvannamalai.



**శ్రీ రమణజ్యోతి వ్యవస్థాపకులు: కీ॥శే॥ డా॥ కె. సుబ్రహ్మణియన్**

**(వ్యవస్థాపక అధ్యక్షులు, శ్రీరమణకేంద్రం)**

# సమాజం, సంసారం

డా॥ కే.యస్. గారి 123వ ప్రవచనం

అనువాదం: డా॥ వి. రామదాస్ మూర్తి

నిత్యజీవితంలో అవసరమైనప్పుడు ఎవరో ఒకరు మనకు సహాయం చేస్తూ ఉంటారు. సహజంగా మనం వాళ్లకు కృతజ్ఞతలు తెలుపుకుంటూ ఉంటాం. అది మంచిది కూడా. మనకు సహాయం చేసే వాళ్ళను అలాగ చేయడానికి భగవంతుడు ఎన్నుకుంటాడని మనం గుర్తించాలి. భగవంతుని కృప ఉంటేనే తప్ప వాళ్ళు మనకు తోడ్పడడానికి రారు. ఈ ప్రపంచంలో కోటానుకోట్ల జనం ఉన్నారు. వాళ్ళందరికీ ఏదో ఒక సహాయం చేయవలసిన అవసరాలు ఉండవచ్చు. అయితే, ఎవరైనా ప్రత్యేకించి మనకు అలాగ తోడ్పడాలంటే, వాళ్ళు దైవ ప్రేరణతో అలాగ చేస్తున్నారన్నది యథార్థం. అంటే, మనకు సహాయపడినది ఆ భగవంతుడేనని గుర్తించాలి. అలా గుర్తించినప్పుడు, మనం ఆ వ్యక్తి లేదా వ్యక్తుల యందు కృతజ్ఞతా భావం కలిగి ఉంటాము.

తల్లి ప్రతి ఒక్కరినీ పెంచి, పెద్ద చేసి ఎంతో వాత్సల్యంతో మనపట్ల ప్రేమను కురిపిస్తుంది. ఈనాడు మనం ఇలా ఉన్నామంటే, మాతృమూర్తుల ప్రేమ, కృప, వాత్సల్యాలే కారణం. ఉద్యోగం రావడంలో సహాయపడిన వ్యక్తిని మనం గుర్తుపెట్టుకుని గౌరవిస్తాం. ఆ క్షణాలలో, తన తల్లి పెంపకం వల్లనే, ఈనాడు ఫలానా ఉద్యోగ అర్హత, అది లభించడం జరిగాయన్న విషయాన్ని పూర్తిగా మరచిపోతాం. గొప్పతనమేమిటంటే, తల్లి దానిని పట్టించుకోదు. తల్లిగా తన విధిని నిస్వార్థంగా నిర్వహించానని సంతోష పడుతుంది. మన శ్రేయస్సే తన ధ్యేయం గనుక, అలాగ ప్రవర్తించ

గలుగుతుంది. ఆయా సందర్భాలలో మనకు సహాయం అందించిన వాళ్ళు మాత్రం మననుండి ధన్యవాదాలను సాధారణంగా ఆశిస్తారు.

## నిస్వార్థ సేవ

జీవితంలో ఎదుర్కొనే కొన్ని సందర్భాలలో మాత్రం, మనకు తల్లితండ్రుల పోషణ, ప్రేమ, వాత్సల్యాలు గుర్తుకు రావచ్చు. యథార్థం చెప్పాలంటే, మనకు సంతానం కలిగిన తరువాతనే తల్లితండ్రుల గొప్పతనం, వారి పట్ల కృతజ్ఞులుగా ఉండాలన్న భావాన్ని పెంపొందించుకుంటాం. అప్పటివరకు వారు పడిన కష్టాలు అర్థం కావు. అదే కాకుండా, మనకు వయస్సు పెరుగుతున్నా కొద్దీ, ఎన్నో కష్టాలు ఎదురవుతాయి. పిల్లల నుండి కూడా ఎన్నో కష్టాలు ఎదురవవచ్చు. అలాంటప్పుడు, తాము ఎంతో ప్రేమతో, ముద్దుగా పెంచిన పిల్లల కారణంగా ఎందుకు కష్టాలు పడవలసి వస్తున్నదో అర్థం కాదు. ఈ విషయం గురించి శతాబ్దాల పాటు ఆలోచించినప్పటికీ, జవాబు లభించదు. ఒకప్పుడు తనకు ఏదో విషయంలో సహాయపడినవారికి, మిత్రులకు, కృతజ్ఞతలు తెలిపిన తాను, భగవంతుని కృప వల్లనే వారు మనకు సహాయం చేశారన్నది గుర్తుకు రాలేదు. అదృష్టవశాత్తు, జీవితంలో సహాయం అందిందని భావిస్తాం. కాని, ఆ అదృష్టం పరమాత్ముని దయ, కృపల వల్లనేనని తెలుసుకోవాలి. ఈ విషయాన్ని అన్ని కోణాల నుండి చక్కగా ఆలోచిస్తే, అసలు విషయం అర్థమవుతుంది. తల్లితండ్రులు అష్టకష్టాలు పడి, చిన్నప్పటి నుండి పెంచి, పెద్ద చేసినందువల్లనే, తరువాతి కాలంలో ఇలాగ ఉండగలిగామన్నది అర్థమవుతుంది.

## దేనిలోనూ మన ఎంపిక లేదు

కొంచెం లోతుగా ఆలోచిస్తే, మంచి తల్లితండ్రుల వల్లనే, మంచి అదృష్టం అన్నది పరిణమించింది కదా అని అనిపిస్తుంది.

ఇంకా లోతుగా గమనిస్తే, మనం మన తల్లితండ్రులను ఎన్నుకోలేదు. భగవంతుడే వారిని ఏర్పరచాడు. తల్లితండ్రులు ఫలానా వారే ఉండాలని నిశ్చయించే స్వేచ్ఛ మనకు లేదు. మరి, వాళ్ళు కూడా, నీ లాంటి వాడినే, అంటే నిన్నే బిడ్డగా కనాలని అనుకోలేదు. ఎలాంటి కొడుకు లేదా కూతురు పుడుతుందో వాళ్లకు తెలియదు. అంటే, నీ యొక్క రూపురేఖలు, మానసిక ప్రవర్తన, ఏ విధంగా ఉంటుందో వాళ్లకు తెలియదు. అలాగే, మీ పిల్లల గురించి, వాళ్ళు ఎలాగ ఉంటారన్నది మీకు తెలియదు.

ఈ విషయం అవగాహనకు వస్తే, మనకు ఏ విషయంలోనూ స్వేచ్ఛ లేదన్న మాట బోధ పడుతుంది. దీనిని అంగీకరించిన తరువాత, ఇక మిగితా అన్ని బంధుత్వాలు, కుటుంబ సంబంధాలు కూడా ముందే నిర్ణయించబడినవేనని, ఆ విషయంలో మనం చేయగలిగినది ఏమీ లేదనేది చెప్పకనే తెలియరావాలి. వీటిని జీర్ణించుకోలేక, తిరుగుబాటు చేద్దామనుకుంటే, అది కుదరదు. ప్రారబ్ధము యొక్క పాత్రను కొందరు అంగీకరించకపోవచ్చు. అలా అంగీకరించకపోవడం కూడా ప్రారబ్ధమే. అయినా, నాకు స్వేచ్ఛ ఉన్నది అని మాట్లాడటం సముచితం కాదు. అప్పటికీ ఒప్పుకొనక విరుద్ధ భావాలు కొనసాగితే, దానివల్ల అసంతృప్తి మాత్రమే మిగులుతుంది. దాని వల్ల మనకు మనశ్శాంతి ఉండదని పూర్వీకులు చెప్పారు.

## భగవంతుని లీల

ఎప్పుడైతే మన పరిమితులను అంగీకరించి, ఏదో ఒక ఉన్నతమైన శక్తి (భగవంతుడు) దీనినంతటినీ నడిపిస్తున్నది అనే అవగాహనకు వస్తామో, అప్పుడు మనం నిర్వహించవలసిన

కర్తవ్యాలను నిర్వహించి, ఫలితాన్ని ఆ భగవంతునికి వదిలి వేస్తాము. దాని వల్ల కొంతవరకైనా మానసిక ప్రశాంతత లభిస్తుంది. భగవంతుని గొప్పతనం ఏమిటంటే, స్వయంగా వచ్చి, తన కరుణ, కృప వల్లనే ఇవన్నీ మనకు లభించాయని చెప్పడు. మన మేధ, పరిశ్రమల కారణంగానే ఇవన్నీ ఫలించాయని అనుకునేలా చేస్తాడు. ఇక్కడ మరొక విషయం గుర్తుంచుకోవాలి. మనం కోరుకున్నవన్నీ లభించవు, నిజంగా మనకు ఏవి అవసరమో, అవి మాత్రమే అనుగ్రహించబడతాయి. అన్నీ లభిస్తే, మనం మరింత దుఃఖ పడవలసి వస్తుంది. మనలో కొంతమంది ఇదంతా భగవంతుడు నడిపించే నాటకమని గ్రహించలేకపోతాము.

భగవాన్ తాము రచించిన 'ఉపదేశసారం' లోని మొదటి శ్లోకం లోనే - 'కర్తురాజ్ఞాయా ప్రాప్యతే ఫలం' అన్నారు. భగవంతుడే మన కర్మల ఫలాన్ని ప్రసాదిస్తాడు. ప్రతి ఒక్కరికీ, కొన్ని విధులుంటాయి. వాటిని నిర్వర్తించడంతో ఫలితం దక్కుతుంది. అదే సమయంలో, మన విధి నిర్వహణ వల్లనే అది దక్కిందని భావించరాదు. ఫలితం అనేది భగవంతుని కృపపై ఆధారపడి ఉంటుంది. అది కూడా మన అవసరాల మేరకే ఉంటుంది. భగవంతుని ఎల్లప్పుడూ ధ్యానించే కుచేలుడు కడు పేదవాడు. కాని, తన పేదరికాన్ని గురించి ఎన్నడూ పట్టించుకోలేదు, దుఃఖపడలేదు. సరియైన సమయంలో కుచేలునికి అన్నీ లభించాయి. తనకున్న పూరిల్లు గొప్ప భవనంగా మారింది. తన భార్యకు విలువైన నగలు ఇవ్వబడ్డాయి. కాని, కుచేలుడు, అవి చూసి సంభ్రమం చెందలేదు. భగవంతుని పట్ల భక్తి ఎప్పుడూ తగ్గరాదని భావించాడు.

## కష్టాల పరిణామం

అలాగే, శ్రీకృష్ణుడు కుంతీదేవిని దర్శించి వెళ్తున్న సమయంలో, కుంతీదేవిని ఏమి కావాలో కోరుకొనమని అడిగాడు. చిన్నప్పటి నుండీ, జీవితాంతం కష్టాలను ఎదుర్కొన్న కుంతీదేవి శ్రీకృష్ణుడితో ''కృష్ణా! ఎల్లప్పుడూ నాకు కష్టాలను ఇవ్వు. ఎందుకంటే, కష్టాలను అనుభవిస్తున్నప్పుడు తప్ప నిన్ను నేను తలచుకోలేను. కాని, నేను నిన్ను ఎల్లవేళలాతలచుకోవాలని అనుకుంటున్నాను. ఎందుకంటె, అన్నింటికీ మూలకారణం నీవు కనుక'' అని అన్నది. భగవంతుని సదా స్మరిస్తూ ఉండడానికి మరొక మార్గం లేదు. **త్యక్త్వా విషయం బాహ్యం రుద్ధ ప్రాణేన రుద్ధ మనసా** - బాహ్య విషయాలను త్యజించి, ఎవరైతే అరుణాచలేశ్వరుని స్మరిస్తారో అటువంటి వారి యొక్క మనస్సు అరుణాచలేశ్వరునిలో లీనమైపోతుంది అని భగవాన్ అన్నారు.

అరుణాచలము బాహ్యంగా కనిపించేది కాదు. మన అంతరంగంలో అరుణాచలుడు ఉన్నాడు. సాధారణంగా, బాహ్యంగా ఉన్నట్లు కనిపించినప్పటికీ, పూర్తి ధ్యానంతో గమనిస్తే, మనలోనే ఉన్నట్లు గోచరమౌతుంది. **అరుణాచల పరమాత్మన్ అరుణో భవ చిత్తకంజ సువికాసాయ** - ఓ అరుణాచల పరమాత్మా! నీదైన కిరణ పంక్తిచే సూర్యుడవై హృదయపద్మాన్ని వికసింప చేయి. అలా నీలోని అరుణాచలుని తలచుకొంటే చాలు, ఎంతో శాంతి లభిస్తుంది. కాని, ఆ తలపు రావడానికి కూడా ఆయన కృప ఉండాలి. ఆయనను తలచుకోకుండా ఉండటానికి, లౌకికంగా ఉన్న వస్తు విషయాలు ఎన్నో అడ్డంకులుగా ఏర్పడుతాయి.

చాలా సమయాలలో, మనకు ధ్యానం చక్కగా కుదరదు.

అప్పుడు, మనం ఎంతో చికాకు పడతాము. కాని, ప్రశాంతంగా ధ్యానం చేసుకునేందుకు కూడా ఆయన కృప అవసరం అన్నది మనం నిజంగా గ్రహించాలి. ఈ విషయంలో ఇతరులు ఎవ్వరూ మనకు సహాయపడలేరు. సరియైన సమయంలో మనకు కావాల్సినది భగవంతుడే ప్రసాదిస్తాడన్న దృఢ విశ్వాసం ఉంటే, అది మనకు సహాయకారిగా ఉంటుంది. అప్పటివరకూ మనం ఓపిక పట్టాలి.

కుండలను తయారు చేస్తున్నప్పుడు, కుమ్మరి సరియైన ఆకారంలోనికి మార్చడానికి, చిన్న కఱ్ఱతో దానిని బయటివైపు కొడుతూ ఉంటాడు. అదే సమయంలో, లోనుండి చేతితో సరిచేస్తూ ఉంటాడు. ఆకారం సరిగా రావడానికి దానిని కొడుతూ ఉండాలి. అలా దెబ్బలు తిన్న తరువాత కుండ చాలా బాగున్నదని మెచ్చుకుంటాము. అదే విధంగా, భగవంతుడు మనలను నిరంతరమూ సరిదిద్దుతూ ఉంటాడు. ఆకారం సరిగా రావడానికి దెబ్బలు తప్పవు.

**అంతటా ఆకాశమే**

ఆకారంలోనే కాకుండ, పరిమాణాల విషయంలోను, మనం కుండలలో చిన్నవి, మోస్తరువి, పెద్దవి చూస్తూ ఉంటాము. ప్రతి కుండకు బాహ్యంగా, అనంతమైన, విస్తారమైన ఆకాశం ఉంటుంది. కుండ లోపల ఉన్న ఆకాశానికి, బయట ఉన్న ఆకాశానికి తేడా ఏమీ లేదు. కాని, కుండ ఒక ఆకారానికి పరిమితమై ఉన్నది కాబట్టి, ఆకాశం కూడా ఆ అకృతిని ధరించినట్లు కనిపిస్తుంది. అలానే మనకు కూడా ఒక ఆకారం ఉన్నది అని అనుకుంటున్నాము కనుక, ఈ శరీరానికే మనం పరిమితమైనట్లు భావిస్తున్నాము. కుండ పగిలి

పోయినప్పుడు, ఎలాగైతే కుండలోని ఆకాశం మాయమై, అనంతాకాశంలో కలసిపోతుందో, అలానే మనకు కూడా ఎప్పుడైతే శరీరముతో తాదాత్మ్యత లేకుండా పోతుందో, జీవించి ఉండగానే, మనం సత్ చిత్ ఆనంద స్వరూపులము అవుతాము. అదే శుద్ధ చైతన్య స్వరూపము కూడా. జ్ఞాని స్థితి ఎలా ఉంటుందో భగవద్గీతలో శ్రీకృష్ణుడు వర్ణించాడు.

**ప్రజహాతి యథా కామాన్ సర్వాన్ పార్థాన్ మనోగతాన్**
**ఆత్మన్యేవాత్మనా తుష్టః స్థితప్రజ్ఞ స్తదోచ్యతే**

జ్ఞాని ఎలాంటి సంకల్పాలు చేయడు. అతనికి ఏ రకమైన కోరికలూ ఉండవు. వ్యక్తిత్వ భావం అసలు ఉండదు. తనకు బాహ్యమైన దేని నుండి గానీ ఆనందాన్ని ఆశించడు. అంతరంగం లోనే ఆనందాన్ని అనుభవిస్తూ ఉంటాడు. జ్ఞాని స్థితప్రజ్ఞుడు, దేహముతో సంబంధం లేని శుద్ధ చైతన్య స్వరూపం. జ్ఞానిని దర్శించుకున్నప్పుడు కేవలం వారి సన్నిధి చాలు, ఎంతో శాంతి ప్రదాయకమౌతుంది. కాని, తాము అలా ప్రసాదిస్తున్నట్లు చెప్పుకోరు.

ఇక విధి నిర్వహణ విషయానికి వస్తే, మన శక్తి మేరకు విధులను నిర్వర్తించాలి. దానికి అవసరమైన శక్తిని ఇచ్చేది ఆ భగవంతుడే అని ఎల్లవేళలా గుర్తుంచుకుంటూనే ఉండాలి. అలాగని సోమరితనం పనికి రాదు. చేస్తున్నది నేను అన్న భావన కలిగినప్పుడు, కార్యం విజయవంతం అవుతుందా కాదా అన్న సందేహాలు తలెత్తుతాయి. కేవలం మానసికంగా, మేధోపరంగా కాకుండా, భగవంతుడే చేయిస్తున్నాడన్న భావన సంపూర్ణంగా ఏర్పడితే, కార్యాన్ని సమర్థవంతంగా పూర్తి చేయగలుగుతాం. అప్పుడు, ఏ ఒత్తిడీ ఉండదు. జయాపజయాలు ఆయన ఆధీనం.

******

### శ్రీ రమణ మహర్షి యొక్క భక్తాగ్రేసరులు

# స్వామి మాధవ తీర్థ

**శ్రీమతి మల్లాది ఫణిమాల**

స్వామి మాధవ తీర్థుల వారి బాల్య నామము మోతీలాల్. బాల్యం నుండి వారు అద్వైత వేదాంతానికి సంబంధించిన విషయాలు, మరణం యొక్క రహస్యము -- ఇటువంటి వాటి గురించి తీవ్రంగా యోచన చేసేవారు. సంచారకులైనటువంటి సాధువులు, మహాత్ములు ఎవరైనా ఎదురుపడితే, ''మృత్యువు తాలూకు రహస్యాన్ని గురించి దయచేసి నాకు వివరించగలరు'' అని అదేపనిగా అడుగుతూ ఉండేవారు. స్వామి మాధవతీర్థుల వారు బాల్యంలోనే సంస్కృతాన్ని నేర్చుకోవడం చేత ఎన్నో పవిత్ర గ్రంథాలను అధ్యయనం చేశారు. ఎన్నెన్నో గ్రంథాలు చదివినప్పటికీ, వారి హృదయమును ప్రభావితం చేసిన గ్రంథం మాత్రం 'శ్రీమద్ భాగవంతం'.

ఆధ్యాత్మిక గ్రంథాలతో పాటు ఆధునిక విజ్ఞాన శాస్త్రానికి సంబంధించిన గ్రంథాలను కూడా స్వామి మాధవ తీర్థుల వారు అధ్యయనం చేసేవారు. ఆధునిక విజ్ఞాన శాస్త్రానికి సంబంధించిన సిద్ధాంతాలలో 'సాపేక్ష సిద్ధాంతం' వారిని ఎంతగానో ప్రభావితులను చేసింది. వారు గొప్ప రచయిత కూడా... నూరు పుస్తకాలకు పైగా రచించి భక్త లోకానికి అందించారు. 1939వ సంవత్సరంలో మోతిలాల్ అనబడే ఈ యువకుడు సన్యాసాశ్రమాన్ని స్వీకరించారు. అటు పిమ్మట మోతిలాల్ 'మాధవ తీర్థ' గా పిలువ

బడ్డారు. వారు సన్న్యాసాశ్రమం స్వీకరించాక భారతదేశమంతటా విస్తారంగా పర్యటించి, ఎన్నో యాత్రలు చేపట్టారు. వారి పాండిత్య ప్రతిభకు, బోధ చేసిన దానిని నిష్టగా ఆచరణలోకి తెచ్చుకునే విధానాన్ని చూసి ప్రజలందరూ వారిని ఎంతో ఇష్టపడి గౌరవించే వారు. సత్యాన్వేషణ కొనసాగిసస్తూ 1944వ సంవత్సరంలో అరుణాచలంలోనికి అడుగుపెట్టారు స్వామి మాధవ తీర్థ. శ్రీ రమణుల సన్నిధానాన 14 రోజులు గడిపారు. అలా గడిపిన ఒక పక్షంలో ప్రతిరోజు శాంతి సముద్రంలో ఓలలాడుతున్నట్టు స్వామి మాధవ తీర్థకు అనిపించేది. ప్రతిరోజు అధ్యయనంతో మరియు అనుభవంతో వారి జీవితం కొనసాగుతున్నట్లు వారికి అనిపించేది.

మొట్టమొదటిసారిగా భోజనశాలలో భగవానులకు స్వామి మాధవ తీర్థుల వారు పరిచయం చేయబడ్డారు. తొలి దర్శనంలోనే శ్రీ రమణుల అనుగ్రహ వీక్షణం స్వామి మాధవ తీర్థ పై నిలిపారు. శ్రీ రమణుల అనుగ్రహ వీక్షణం పై స్వామి మాధవ తీర్థ ఇలా ఆవిష్కరించారు:

"శ్రీ రమణుల యొక్క చూపులో తీక్షణమైన భాస్కరుని ప్రకాశాన్ని నేను చూశాను. ఆ సూర్యుని ప్రకాశంలో నా శ్వాస ఆగి పోయినట్లు నాకనిపించింది. మనసు చెప్పలేనంత ఆనందంతో, ఎన్నడూ చవిచూడని ప్రశాంతతతో నిండి గుర్తుతెలియని ఆధ్యాత్మిక తీరాలకు గొనిపోబడింది."

స్వామి మాధవ తీర్థుల వారు గొప్ప పండితులు కావడం చేత వారు తమ అనుభవములను మరియు రమణులను తానడిగిన

ప్రశ్నలను, వారు ఇచ్చిన సమాధానాలను వ్రాసి పొందుపరిచారు. శ్రీ రమణల పాదాల చెంతకు వచ్చినవారికి వారి అనుగ్రహ వీక్షణం చేత పొందవలసినది పొందగలిగే యోగ్యత ఉన్నా లేకున్నా, వారు తమ సంపూర్ణ అనుగ్రహాన్ని వచ్చిన వారందరి మీద ఒకే రకంగా వర్షించేవారు. స్వామి మాధవ తీర్థుల వంటి వారు నిజంగా భాగ్యశాలులు కాబట్టి ఆ అనుగ్రహాన్ని అందిపుచ్చుకోగలిగేవారు.

శ్రీ రమణాశ్రమంలో వారు గడిపిన 14 రోజులలో ప్రతి నిమిషాన్ని పూర్తిస్థాయికి సద్వినియోగం చేసుకున్నారు స్వామి మాధవ తీర్థ. ''పూర్తి వివేక వైరాగ్యముల ద్వారా సాధకుడు సాక్షీభావ స్థితికి చేరుకోటానికి కాంక్షించవచ్చును. కానీ దానికంటే ఉన్నతమైన స్థితి ఒకటి ఉన్నది. ఆ స్థితియందు ఒకరు విశ్వమంతటిలోనూ, అన్ని జీవులలోనూ తన ఉనికినే గుర్తించడం జరుగుతుంది. సంస్కృత భాషలో ఈ స్థితినే 'అభిన్నభావము' అని అంటారు. శ్రీ రమణుల అనుగ్రహం చేత అందుకోబడిన ఈ స్థితి సామాన్య సాధకుని ఆలోచనాపరిధికి, మేధకి అతీతమై ఉంటుంది. ఇట్టి అభిన్నభావ స్థితి యొక్క స్వభావము మరియు వైభవము కొంత వరకు మనం అర్థం చేసుకొనవచ్చు'' అని స్వామి మాధవ తీర్థ వ్రాశారు.

హాలులో భక్తులందరి పైన మహర్షి యొక్క శక్తి ప్రసరితమవుతుందని, శ్రీ రమణులను దర్శించుకున్న తొలి రోజులలోనే స్వామి మాధవ తీర్థ గ్రహించారు. వారి సన్నిధిలో కూర్చుని శ్రీ రమణ అనుగ్రహ ప్రసారమును సంపూర్ణ స్థాయిలో అందుకోటానికి నన్ను

నేను ఏ రీతిలో సిద్ధపరచుకోవాలి? అని శ్రీ రమణులనే అడిగి తెలుసుకోవాలనుకున్నారు, స్వామి మాధవ తీర్థ. ''భగవాన్, మీ సన్నిధిలో కూర్చుని మీ అనుగ్రహాన్ని, మీరు ప్రసరించే చైతన్య శక్తిని అందుకోవటానికి సాధకులమైన మేము ఎట్టి మానసిక స్థితిని కలిగి ఉండవలెనో సెలవీయుము'' అని స్వామి మాధవ తీర్థుల వారు శ్రీ రమణులను అర్థించారు. అప్పుడు మహర్షి ఈ విధంగా సమాధానం ఇచ్చారు.

''మాధవతీర్థా, మనసును నిశ్చలముగా ఉంచండి. అది చాలు. సాధకులు తమను తాము నిశ్చలంగా ఉంచుకొనగలిగితే ఈ హాల్లో కూర్చుని ఆధ్యాత్మిక సహాయమును ఖచ్చితంగా అందుకొనగలరు. ఆధ్యాత్మిక సాధనములన్నింటి యొక్క ముఖ్యోపదేశము సాధనలను వదిలివేయటమే. మనస్సు నిశ్చలమైనప్పుడు ఆత్మ యొక్క చైతన్య శక్తి అనుభవంలోనికి వస్తుంది. ఆత్మ శక్తి యొక్క చైతన్యతరంగాలు ఎల్లెడలా వ్యాపించి ఉంటాయి. మనస్సు నిశ్చలంగా, పరమశాంతితో నిండి ఉన్నప్పుడు మాత్రమే సాధకులు ఆ చైతన్య తరంగాలను అనుభవించగలుగుతారు'' అని శ్రీ రమణులు అన్నారు.

స్వామి మాధవ తీర్థ ఇలా అన్నారు:

''జ్ఞానము జ్ఞేనము జ్ఞాత అంటే తెలుసుకొనుట తెలుసుకొనబడేది తెలుసుకునేవాడు అనే విషయాలన్నీ కూడా సహజంగానే 'ఈ జగత్తు సత్యము' అనే అభిప్రాయంతోటి సమ్మిళితమై ఉన్నాయి. ఈ విషయంపై శ్రీ రమణులు అభిప్రాయమును వెల్లడించే ముందు

ఇది ఎంతో కాలంగా నేను మిక్కిలి ఆసక్తికొనియున్న విషయమనీ, అందుచేతనే నేను శ్రీ రమణాశ్రమానికి రాకపూర్వమే 'మాయ' అనే పేరుగల ఒక చిన్ని పుస్తకాన్ని వ్రాశాను. అందులో ఈ జగత్తు యొక్క నిత్యత్వమును గురించి భారతీయ దర్శనశాస్త్రంలో వివరింపబడిన విషయాలకు ఆధునిక కాలంలో గొప్ప భౌతిక శాస్త్రవేత్త అయిన ఐన్స్టీన్ నిరూపణ చేసిన 'సాపేక్ష సిద్ధాంతము' ద్వారా వెల్లడి చేసిన విషయాలకు గల సారూప్యమును వివరించి ఉన్నాను. నేను ఆ పుస్తకము యొక్క ప్రతిని మీకు పంపియున్నాను, భగవాన్. మరి నేను ప్రతిపాదన చేసిన విషయంపై మీ అభిప్రాయాన్ని తెలుసుకోవాలని కుతూహల పడుతున్నాను అన్నారు. శ్రీ మాధవతీర్థుల వారు కనపరిచిన కుతూహలమునకు సమాధానముగా శ్రీ రమణులు తాము వారు పంపిన పుస్తకాన్ని పూర్తిగా చదివానని, ద్రష్టను అంటే చూసేవాడిని సరిదిద్దుట ద్వారా సర్వమును సరిదిద్దవచ్చుననియూ, ఆ పుస్తకంలో చూచువారు పెక్కురున్నట్లు వ్రాశారు కానీ నిజానికి ద్రష్ట ఒక్కరే ఒక్కరు అని, 'అనేకులు' అనేది చూసేవాడి ఊహలలోనే ఉంటారు. వాస్తవంలో ఉండరు" అని తేల్చి చెప్పారు. ఈ జవాబు మరియు తర్వాత రమణులు ఇచ్చిన జవాబులలో వారు అనుగ్రహపూర్వకంగా మాధవ తీర్థకు ఈ విషయాన్ని గురించి వారు రచించిన పుస్తకంలో జరిపిన చర్యలో జరిగిన ఒక పొరపాటును ఎంతో సున్నితంగా ఎత్తి చూపించారు. స్వామి మాధవతీర్థుల వారు ఆ పుస్తకంలో వాదములన్నింటినీ ఒక తప్పు నమ్మకం పై ఆధారపడి చేశారని

గ్రహించారు. శ్రీ రమణులు చాలాసేపు స్వామి మాధవ తీర్థుల వారికి వివరణ ఇచ్చి సరియైన దృక్కోణమును అనుగ్రహించారు.

స్వామి మాధవ తీర్థుల వారు శ్రీ రమణుల వద్దనున్న స్వల్ప కాలంలో వారి నుండి వైభవోపేతమైన ఆధ్యాత్మిక బోధలనందు కున్నారు. స్వామి మాధవ తీర్థుల వారు రమణులను వ్యక్తిగతమైన సలహా కొరకు అడుగగా రమణులు ఆయనకు ఇలా చెప్పారు. "ప్రయాణాలు చేయడము, ఉపన్యాసములు ఇవ్వడం తగ్గించండి. ఆత్మ పైన ధ్యానం చేయండి".

మాధవ తీర్థుల వారు మారు మాట్లాడకుండా శ్రీ రమణుల ఉపదేశం చేసిన దానిని పాటించారు. తీవ్రంగా సాధన చేసుకునే వాళ్ళందరికీ స్వామి మాధవతీర్థుల వారు, "శ్రీ రమణాశ్రమమునకు వెళ్లి శ్రీ రమణులతో కొంతకాలం ఉండండి. వారి సమక్షంలో గడపండి. శ్రీ రమణులు నాకు అనుగ్రహించినదే మీ అందరికీ అనుగ్రహిస్తారు" అని సలహా ఇచ్చేవారు. వారు గుజరాత్ లోని సబర్మతి నది ఒడ్డున వేదాంత ఆశ్రమాన్ని కూడా స్థాపించారు. గుజరాత్‌లోని ప్రముఖ పండితులు, సాధకులు, మహాత్ములు అందరూ స్వామి మాధవ తీర్థుల వారిని బాగా ఎఱుగుదురు. 1956వ సంవత్సరంలో స్వామి మాధవ తీర్థుల వారు 60 మంది గుజరాతి భక్తులతో కలిసి రమణాశ్రమానికి వచ్చారు. అలా వచ్చి కొన్ని వారాలపాటు ఆశ్రమంలో ఉన్నారు. స్వామి మాధవతీర్థుల వారు సంపూర్ణ శరణాగత భావనలో మునిగి భక్తిపారవశ్యంతో నిండిన జీవితాన్ని గడిపిన గొప్ప రమణ భక్తులు మాత్రమే కాదు! ఎందరెందరో సాధకులకు మార్గనిర్దేశకులు కూడా.

******

# స్మృతులు

# సి.వి. సుబ్రహ్మణ్య అయ్యర్

**శ్రీ రమణాశ్రమ ప్రచురణ** Fragrant Petals **లోని ఐదవ వ్యాసానికి స్వేచ్ఛానువాదం**

**సరోజా ప్రసాద్**

భగవాన్ శ్రీ రమణుల దర్శనార్థం ఒకసారి నలుగురు మహిళలు ఆశ్రమానికి వచ్చారు. నలుగురూ, నాలుగు దేశాలకు చెందినవారు. ఒకరు అమెరికా, ఇంకొకరు ఇటలీ, ఒకరు ఫ్రాన్స్ దేశస్తులు, నాలుగవ మహిళ భారతీయ క్రైస్తవురాలు. భగవాన్‌కు నమస్కరించి, ప్రార్థనా మందిరంలో వారి ఎదుట కూర్చున్నారు. అమెరికన్ మహిళ ప్రశ్నలు అడగటం, భగవాన్ ఇచ్చిన సమాధానాలను, హాలులోని భక్తులొకరు అనువదించడం - ఇలా, ఆ సంభాషణ కొనసాగింది. చివరిగా ఆమె, “మా ఆధ్యాత్మికోన్నతికి మీ అనుగ్రహం కావాలి” అని ప్రార్థించింది. అందుకు సమాధానంగా భగవాన్ “అనుగ్రహమే లేకపోతే మీరసలు ఇక్కడకు రావాలని అనుకునేవారు కాదు” అన్నారు. ఎంత గొప్ప సమాధానం! భగవాన్ సన్నిధికి వచ్చిన వారెవ్వరూ, నిరాశతో తిరిగి వెళ్ళలేదు. జిజ్ఞాసువులకు సమాధానంగా “మీరు ఇప్పటికే ఆత్మ స్వరూపులు. అది తెలుసుకోవడానికి అజ్ఞానపు తెర తొలగించాలంతే” అనేవారు భగవాన్. “నాకు మాత్రమే తెలుసు, మీకు తెలియదు - అనే బూటకపు గురువుల మాయలో పడకండి” అని, స్వామి వివేకానందులు తమ అనుచరులకు చెప్పేవారు. అదేవిధంగా, భగవాన్ ఉపదేశాలకు సంబంధించి, ఎటువంటి మర్మం కాని, దాపరికం కాని ఉండేది కాదు.

తమ వద్దకు వచ్చేవారితో భగవాన్ వ్యవహరించే తీరు ఎంతో స్ఫూర్తిదాయకంగా ఉండేది. “మీరు ఆత్మ స్వరూపులై ఉన్నారు. కొత్తగా తెలుసుకునేదేమీ లేదు, మీరు చేయవలసినదల్లా, ఆత్మ విచారణ ద్వారా, అజ్ఞానపు తెరను తొలగించే ప్రయత్నమే” అనేవారు.

మరల ఆ నలుగురు మహిళల విషయానికొస్తే - అమెరికన్ మహిళ ఇలా అడిగింది. “భగవాన్, నేను అమెరికాకు తిరిగి వెళ్ళి పోతున్నాను. మీరు అక్కడికి వస్తారా?” అని. అందుకు భగవాన్ చిరునవ్వుతో “నేను అక్కడే ఉన్నాను కదా? నాకు ఈ దేశ కాలాదులు వర్తించవు” అన్నారు.

అరుణాచల దివ్య ప్రకాశం, పిన్న వయస్సులోనే రమణుల హృదయాన్ని దేదీప్యమానం చేసింది. అక్కడినుండి, వారి తలపులు, అరుణాచలంలో నిండిపోయాయి. అరుణాచలేశ్వరుడు తన లీలా ప్రకటనానికి తగిన వాహికగా రమణులను ఎంచుకున్నాడు. భగవద్గీత నాలుగవ అధ్యాయంలో శ్రీ కృష్ణ పరమాత్మ **“యదా యదాహి ధర్మస్య గ్లానిర్భవతి భారత అభ్యుత్థాన మధర్మస్య తదాత్మానం సృజామ్యహం”** అని చెప్పలేదా!

సంసార బంధంలో పడి, జనన మరణ చక్రంలో కొట్టుమిట్టాడు తున్న మానవాళిని ఉద్ధరించేందుకు, అపార కరుణా సముద్రుడైన అరుణాచలేశ్వరుడు, రమణులుగా మనకు దర్శనమిచ్చాడు. దానికి తగినట్లే, తన ప్రయత్నమేమీ లేకుండా, కేవలం భగవదిచ్ఛతో, తనకు కలిగిన అలౌకిక అనుభవంతో, శరీరం వేరు, అజరామరమైన ఆత్మ వేరు - అని వారు గ్రహించగలిగారు. దరిమిలా జరిగిన అన్ని సంఘటనలలోను రమణులు, ఆ అరుణాచలేశ్వరుని దివ్య శక్తి

చేతులలో కేవలం ఒక ఉపకరణమైనారు. మదురైలో, ఇల్లు విడిచి వెళ్లేముందు, తన సోదరుడికి వ్రాసిన లేఖలో తన తండ్రి పిలుపు వచ్చిందని పేర్కొన్నారు. "భగవంతుని పిలుపు" అనే పేరుతో ప్రారంభించిన పత్రిక నేడు ప్రపంచం నలుమూలలకు రమణుల బోధలను అందిస్తున్నది.

రమణులు తిరువణ్ణామలై వచ్చి, అరుణాచలేశ్వరునికి తనను తాను సంపూర్ణంగా సమర్పించుకున్నారు. ఈ శరణాగతితో, తాను తన వ్యక్తిత్వాన్ని కోల్పోయి, తాను ఆత్మ స్వరూపమేనని, ఆ స్వరూపం కూడా అరుణాచలేశ్వరుడేనని తెలుసుకొన్నారు. అరుణాచలుడే తన తండ్రి అని భావించడానికి కారణమేమిటి అని భక్తుడొకరు భగవాన్‌ను అడిగితే, సమాధానంగా, భగవాన్ నవ్వి ఊరుకున్నారు. "బహుశా ఇతరుల కోసం ఇలా చెప్పారేమో" అని ఆ భక్తుడు వ్యాఖ్యానించగా, భగవాన్ "అవును. అటువంటి భావన ఉన్నప్పుడు దానికొక మూలస్థానం కూడా ఉండాలి కదా" అన్నారు. అరుణాచలేశ్వరునితో తమ అభేదం గురించిన ఎఱుక కలిగిన తోడనే, దక్షిణామూర్తిలాగా ఆలయంలో మౌనంగా కూర్చుండిపోయారు. భగవాన్ కఠోర తపస్సు చేశారనుకోవడం పొరబాటు. చూసేవారికి అది కఠిన తపస్సులా కనిపించి ఉండవచ్చును కాని, రమణులకు అప్రయత్నంగానే లక్ష్య సిద్ధి కలిగింది. తపస్సు చేయవలసిన అవసరమే వారికి రాలేదు. ఎటువంటి ప్రయత్నము లేకుండా, వారు మౌనంగా కూర్చుండి పోయారు. మౌనము లేదా తపస్సే వారి నిజ స్వరూపం. తన మౌనం ద్వారానే ఆ భగవంతుని పిలుపును ప్రపంచం నలుదెసలకు అందిస్తూ, ఆ అరుణగిరిపై కొలువైనారు రమణ భగవాన్.

# స్మృతులు 4
# ఇద్దరు మహాత్ములు భగవాన్‌ను కలిసిన వేళ
# విశ్వనాథ స్వామి

**శ్రీ రమణాశ్రమ ప్రచురణ** Surpassing Love and Grace **లోని నాలుగవ వ్యాసానికి స్వేచ్ఛానువాదం**

**అనువాదకులు: శ్రీ రవికృష్ణ శర్మ**

అచ్యుతదాస గారు భగవాన్ యొక్క అత్యున్నతమైన ఆధ్యాత్మిక స్థితిని గురించి విచారించి తెలుసుకున్న మొట్టమొదటి భక్తులలో ఒకరు. వారు సన్న్యసించక మునుపు వారి పూర్వాశ్రమ నామము అబ్బాయి నాయుడు. వారు మృదంగం వాయించడంలో నేర్పరి. వారు భక్తి పూర్వకమైన మరియు అద్వైతానికి సంబంధించిన గొప్ప భావం కలిగిన తమిళ కీర్తనలను ఎన్నింటినో కూర్చారు. భగవాన్ గురించి విని, భగవాన్‌ను దర్శించటానికి గురుమూర్తం (అరుణాచలమునకు తూర్పున కీల్నాత్తూర్ అనే గ్రామానికి) వెళ్లారు. ఆ గురుమూర్తం ఒక సాధువు యొక్క సమాధి మందిరం. అక్కడ భగవాన్ 19వ శతాబ్దపు చివరి రోజులలో సహజ నిర్వికల్ప సమాధిలో పూర్తిగా లీనమై ఉన్నారు. అచ్యుతదాస గారు భగవాన్ ఎదుట కూర్చొని కాసేపు వేచి యున్నారు. భగవాన్ అప్పుడు యువకునిగా ఉన్నారు. కొంత సమయం తరువాత భగవాన్ కళ్ళు తెరవగానే, అచ్యుతదాస గారు భగవాన్‌కు గౌరవ వందనాన్ని అర్పించి, భగవాన్ పాదాలను కాసేపు ఒత్తి, గొప్ప భక్తి భావంతో ఈ విధంగా అన్నారు. ‘‘ఒక వ్యక్తి గొప్ప శాస్త్ర జ్ఞానం కలిగి ఉండవచ్చు, లేదా గొప్ప రచయిత అయి ఉండవచ్చు, లేదా గొప్ప కావ్యాలను వ్రాసే వ్యక్తి

అయి ఉండవచ్చు, లేదా ఈ ప్రపంచంలో ఇంకేదైనా అయి ఉండవచ్చు. కాని మీలాగ ఒక వ్యక్తి, తన ఆత్మయందే నిలకడగా ఉండగలిగిన వారు చాలా అరుదు" అని అన్నారు.

అచ్యుతదాస గారు తన శిష్యులను ఉద్దేశించి ఈ విధంగా పలికారు. "తరువణ్ణామలైలో చాలా అరుదైనది ఒకటి ఉన్నది". వారు ఉటంకించిన ఆ అరుదైనది భగవాన్ గురించి. అచ్యుతదాస గారి సమాధి మద్రాస్ రాష్ట్రంలో ఉత్తర ఆర్కాట్ జిల్లాలోని ఆర్ని అనే గ్రామానికి ఉత్తరాన కన్నమంగళంలో ఉన్నది. భగవాన్ తిరువణ్ణామలైకి వచ్చినప్పుడు వయస్సులో చాలా చిన్నవారైనా, వారి యొక్క దివ్య వీక్షణం ఎంతోమంది ఆధ్యాత్మిక మార్గంలో నడిచేవారికి ఒక దివ్యానుభూతిని కలిగించినదని చెప్పటానికి ఇది ఒక చిన్న తార్కాణం మాత్రమే.

భగవాన్‌ను దర్శించి, గొప్ప అనుభూతిని పొందిన మహాత్ములలో ఇంకొకరు, కేరళ రాష్ట్రానికి చెందిన శ్రీ నారాయణ గురు గారు. వీరు దక్షిణ భారతదేశంలో చాలా పేరు గడించినవారు. వీరు చేసిన తపస్సు వలన, సమాజంలో వీరు సుప్రసిద్ధులు. వీరు భగవాన్‌ను స్కందాశ్రమంలో ఉండగా దర్శించారు. భగవాన్‌కు గౌరవ వందనాలు అర్పించిన తరువాత, భగవాన్‌కు ఎదురుగా మౌనముగా కూర్చొని, భగవాన్‌ను గమనిస్తూ ఉన్నారు. ఎంతోమంది భక్తులు చిన్న పెద్ద అని తేడా లేకుండా అందరూ భగవాన్ కు దణ్ణం పెట్టి వెళ్ళటమో, లేదా కాసేపు భగవాన్ సన్నిధిలో కూర్చొని వెళ్ళడమో చేసేవారు. కాని భగవాన్ మాత్రము మౌనంగా కూర్చొని కన్నులు రెప్ప వాల్చకుండా తెరుచుకొనే ఎవ్వరి గురించి ఏ విధమైన

సమాచారం తెలుసుకొనుట లేదు. ఏ ఒక్కరినీ ఆహ్వానించటం కాని, అక్కడనుండి వెళ్ళేటప్పుడు అనుమతులు ఇవ్వటం కాని ఏమీ లేవు. కాని, అక్కడ అన్ని సమయాలలో అందరూ భగవాన్ యొక్క ప్రకాశవంతమైన సత్ చిత్ ఆనంద స్థితిలో పాలుపంచు కుంటున్నారు. భగవాన్ యొక్క ఆహ్వానాన్ని మన్నించి నారాయణ గురు గారు, వారి శిష్యులతో కలసి భగవాన్‌తో మధ్యాహ్న భోజనాన్ని స్వీకరించారు. ఆ తరువాత భగవాన్ నుండి అనుమతి తీసుకొని వెళ్లేముందు ‘‘ఇక్కడ కూడా అదే విధంగా ఉండాలి’’ అని కోరుకుంటున్నాను అన్నారు. దాని అర్థం నారాయణగురు కూడా భగవాన్ పొందిన స్థితిని పొంది ఆత్మలో నిలకడగా ఉండాలి అని ఆశీర్వదించమన్నారు. దానికి భగవాన్ అనుగ్రహ పూర్వకమైన ఒక చిరుమందహాసం చేశారు.

నారాయణగురు గారు వారి స్వస్థానానికి వెళ్ళిన తరువాత, భగవాన్ని స్తుతిస్తూ, సంస్కృతంలో ఐదు శ్లోకాలతో కూడిన ‘‘నివృత్తి పంచకం’’ అనే దానిని ఆశ్రమమునకు పంపించారు. దాని సారాంశం ఏమిటంటే ‘‘ఎవరైతే ఈ ప్రపంచంలో ఉన్నట్లుగా కనిపించే ద్వంద్వాలను తన మనో దృష్టితో చూడక లేదా విచారణ చేయక ఈ ద్వంద్వాలను దాటి ఉంటారో వారు మాత్రమే మోక్షానందాన్ని పొంది ఆనందంగా ఉండగలరు.’’ నారాయణగురు గారు, వారి శిష్యులు ఎవరైనా భగవాన్ని దర్శించి వారి వద్దకు వస్తే, ఆ శిష్యులను, భగవాన్ని దర్శించటం వలన వారికి కలిగిన అనుభూతులను చాలా ఉత్సుకతతో, ఆసక్తితో ప్రతీదీ అడిగి తెలుసుకునేవారు.

******

అధ్యాయము - 2

# భగవాన్ తో జంతు భక్తులు

# మమత సంగీతం - సమత సంకేతం

శ్రీ రమణాశ్రమ ప్రచురణ Bhagavan Ramana The Friend of all Creation లోని మొదటి వ్యాసానికి స్వేచ్ఛానువాదం

(గత సంచిక తరువాయి) వి. రమేష్ బాబు

ఒరేయ్ నీకూ పళ్ళెం వస్తుంది ఆగు, కాస్త ఆగు, తొందర పడతావే! అంటే, యజమాని పళ్ళెం రాని పిల్లవాడిని ఆగమన్నట్లు ఉన్నది కదా! కానీ, అది కోతుల భిక్ష సమయంలో తొందరపడి ప్రక్క పళ్లెం నుండి తీసుకోబోతున్న కోతికి చెప్పిన మాట.

రారా బుజ్జీ రా! రా! వచ్చి ఇక్కడ కూర్చో అనగానే ఓ పిల్లి వచ్చి భగవాన్ ప్రక్కన కూర్చుంటుంది. దామ్మా! దా! వచ్చి కూర్చో అనగానే ఓ ఉడుత వచ్చి వారి ప్రక్కన కూర్చుంటుంది.

శ్రీ రమణాశ్రమం ప్రారంభం నుండి నేటి దాకా సాధువులకు, సన్న్యాసులకు నారాయణ భిక్ష పేరుతో మొదట భోజనం పెడతారు. తరువాత జంతువులకు, పక్షులకు చివరగా భోజన శాలలోని అతిథులకు, భక్తులకు, సందర్శకులకు భోజనం వడ్డించ బడుతుంది.

భోజనం ఏ స్థాయిలోదైనా సరే, అందరికీ అదే ఆహారం సమానంగా వడ్డించబడుతుంది. ఆహారం వడ్డించేటప్పుడు పెద్దా, చిన్నా, పేదా, గొప్పా, మనిషి, జంతువు ఏ తేడాలూ ఉండవు. అక్కడ సకల జీవుల సహజీవనం, అంతా సమానత్వమే పరిమళిస్తుంది.

## జ్ఞాని

భగవాన్ శ్రీ రమణ మహర్షిని ఒక భక్తుడు ''భగవాన్, జ్ఞానిని ఎలా గుర్తించగలం?'' అని ప్రశ్నించాడు.

ఎట్టి పరిస్థితులు ఎదురైనా సమతుల్యతతో, స్థిర బుద్ధిని కలిగి, అన్ని జీవుల పట్ల సమానమైన, విశ్వజనీనమైన దృష్టి కలిగి, మొక్క, పురుగు, పక్షి, మనిషి, జంతువు అన్న పట్టింపు లేకుండా ప్రేమ, రక్షణ, కరుణ అన్న ఆత్మీయ భావనలతో ఎవరు సకల జీవులను సమాదరిస్తారో, ఆయనే జ్ఞాని అని అన్నారు.

శ్రీ రమణ గీత 18వ అధ్యాయములో, 22వ శ్లోకములో భగవాన్ శ్రీ రమణ మహర్షి గురించి ''బాలునియందు, జడుడైన గొల్లవానియందు, కుక్కయందు, దుర్జనునియందు, పండితుని యందు, ఆశ్రితునియందు, పక్షపాతము లేక సమదృష్టి కలవాడు, శక్తివంతుడైన శాంతుడు, భక్తుడైన భేదభావము లేనివాడు, రాగ విహీనుడైనా, లోకమందు వాత్సల్యము కలవాడు, దివ్యాంశ కలవాడైనా వినయ సంపన్నుడు అని వివరించారు.

భగవాన్ సన్నిధిలో పలు సందర్భాలలో, పైన చెప్పిన లక్షణములన్నీ శ్రీ రమణాశ్రమంలో భక్తులకు, సందర్శకులకు అనుభవైకవేద్యమే.

భగవాన్ సమక్షంలో, మనుషులతో పాటు సకల జీవరాశి భయం లేకుండా పూర్తి స్వేచ్ఛతో శాంతియుతంగా ఉంటాయి.

భగవాన్ ఆశీస్సులతో గోలక్ష్మి అనే ఆవు, జాకి అనే కుక్క, వల్లి అనే జింక, కాకి మోక్షాన్ని పొందాయి. ఆయన అపార కరుణ

వలన పైన తెలిసిన నాలుగు జీవులకు శ్రీ రమణాశ్రమంలో సమాధులు నిర్మించారు.

గోలక్ష్మి సమాధి మీద వెణ్బా వృత్తంలో తమిళ భాషలో 'గోలక్ష్మి ముక్తిని పొందింది'' అని వ్రాశారు.

**కర్మ**

కర్మలు మూడు రకాలు. 1. ప్రారబ్ధ కర్మ 2. ఆగామి కర్మ 3. సంచిత కర్మ. పూర్వజన్మలలో కూడబెట్టుకొనినది సంచిత కర్మ. కూడబెట్టుకొనినది అనుభవములోనికి తెచ్చునది ప్రారబ్ధ కర్మ. దీనినే విధి అంటారు. ఈ జన్మలో చేసే పనులతో కూడబెట్టుకొనబోయేది ఆగామి కర్మ.

ఒకరు ఉన్నత జన్మ పొందుతారా, హీన జన్మను పొందుతారా అన్నది నిర్ణయించేది వారి ప్రారబ్ధ కర్మ. ఈ జన్మము సంచిత కర్మ, మరు జన్మము ప్రారబ్ధ కర్మ.

మానవులకున్న హేతువాదము, తార్కికశక్తి ఇతర జీవులకు లేవు. కావున అవి వారి ప్రారబ్ధ కర్మలను పూర్తి చేసుకుంటాయి. వారికి ఆగామి కర్మ లేదు కావున, వారి సంచిత కర్మ అలాగే ఉండి పోతుంది.

జనన మరణ చక్రభ్రమణము నుండి విముక్తి కావాలంటే మానవజన్మ ఎత్తి తీరవలసినదే అంటుంది భారతీయ సనాతన ధర్మం. భగవాన్ మాటలలో, కర్మ అవశేషం పోగొట్టుకోవడానికి పండిన జీవులకు ఏ ఉపాధి అయినా అనగా పక్షి, జంతువు, మొక్క, ఏ శరీరమైనా కర్మ పోగొట్టుకొని మోక్షం పొందవచ్చు.

పురాణాలలో, భగవంతుని అనుగ్రహంతో ఈ సంసార బంధనాల నుండి మోక్షం పొందిన ఇతర జీవుల గురించి చెప్పబడి ఉన్నది.

రామాయణంలో శ్రీరామచంద్రమూర్తి చేతుల్లో పక్షియైన జటాయువు మోక్షం పొందినది, భాగవతంలో వైకుంఠం నుండి సరాసరివచ్చి శ్రీమహావిష్ణువు గజేంద్రుడనే ఏనుగుకి మోక్షమిచ్చాడు. అలాగే చిదంబరంలో ఒక ముళ్ళ మొక్క ఉమాపతి శివుని చేతులలో మోక్షం పొందినది. భగవాన్ సకల జీవుల పట్ల ఏ పక్షపాతము లేకుండా సమదృష్టి కలిగి ఉంటారు. తనతో సంబంధం కలగడం ఆ జీవికి ఏ ప్రారబ్ధ కర్మమో అంటారు.

భగవాన్ దృష్టి విశ్వజనీనమైనది. మానవులతో ఎలా ప్రవర్తిస్తారో, పక్షులు, జంతువులతో కూడా ఆయన అలానే ప్రవర్తిస్తారు. అవి కూడా ఆయనతో అలానే ప్రతిస్పందిస్తాయి. మనుషులు భగవాన్ పట్ల ఎలా ఆకర్షితులౌతారో, ఇతర జీవులు సైతం అలానే ఆకర్షితులౌతాయి.

మనుషులు ఎవరైనా పక్షులకు, జంతువులకు ఏ మాత్రం అపకారం తలపెట్టినా వారు సహించరు. అతిగా పూలు కోసినా, చెట్ల కొమ్మలు విరిచినా ఆయన వారిని కోపగిస్తారు.

అరుణాచల పర్వత నివాసానికి ముందు, భగవాన్ గురుమూర్తంలో 18 నెలలు నివాసమున్నారు. పక్షులు, ఉడుతలు వారిని ఇబ్బంది పెట్టాయి. పక్షులు ఆయనకు దగ్గరలో ఆ చుట్టూతా కూడా గూళ్ళు కట్టుకునేవి. భగవాన్ ఆ రోజుల్లో, తన చుట్టూ ఉన్న ప్రపంచంలో ఏం జరుగుతున్నా పట్టింపులేనట్లు,

కదలక మెదలక రాతి బొమ్మవలె నిశ్శబ్దంగా ఉండేవారు. అయినప్పటికీ, తన చుట్టూవున్న విషయాల మీద ఆయనకు నిశితమైన పరిశీలన ఉండేది.

**ఆయన అతి గొప్ప ప్రకృతి ప్రేమికుడు**

భగవాన్ రమణాశ్రమానికి వచ్చిన తరువాత, గురుమూర్తంలో జరిగిన సంగతి గుర్తు తెచ్చుకునేవారు. ఒక పక్షి మట్టితో గూడు కట్టింది. ఆ మట్టి గూడు లోనే అది గుడ్లు పెట్టి పొదిగి పిల్లలను చేసింది. కొంతకాలానికి ఆ పసికూనలు రెక్కలు వచ్చాక తల్లితో కలిసి ఎగిరిపోయాయి. ఆ తరువాత ఆ ఖాళీగూడును ఓ ఉడుత ఆక్రమించింది.

భగవాన్ తనకు జ్ఞాపకం ఉన్నంతవరకు, కందిరీగల జీవన చక్రభ్రమణాన్ని ఎంతో సునిశితంగా పరిశీలించేవారు. ఆ పరిశీలనలో తెలిసిన అంశాలను వారు వేదాంత పరంగా పలు భావనలలో వివరించేవారు.

భగవాన్ భక్తుడు "ఆర్థర్ ఆస్బర్న్" మాటలలో - ఒకసారి భగవాన్ భోజనం మధ్యలో మామిడి పండును రుచి చూస్తున్నారు. మామిడిపళ్ళ సీజన్ అప్పుడే మొదలైంది. మొదటి పండు తీపా, పులుపా తెలుసుకొని, దానిని తెల్ల నెమలికి ఇవ్వాలని భగవాన్ ఉద్దేశ్యం. అది తెలిసి ఆస్బర్న్ భగవాన్లో ఉన్న జీవకారుణ్యానికి ఆశ్చర్యపోయాడు.

పాస్కలైన్ మాలెట్ ఒక ఫ్రెంచి వనిత. భగవాన్ ఆశీస్సులు కోరి వచ్చారు. ఆమె 1936లో 'Turn Eastward - Glimpses

into India life' గ్రంథాన్ని రచించారు. అందులో భగవాన్ గురించి ఇలా వ్రాశారు.

“భగవాన్ సకలజీవుల పట్ల సమభావనతో ప్రవర్తించే తీరు, మహర్షి దృష్టిలో అంతా సమానులే అని, మనుషులే కాక జంతు సామ్రాజ్యమంతా ఆయన కృపకు పాత్రులు అని మన యువ సోదరులకు చెప్పడానికి ఆయన ప్రేమ, కరుణ కురిపించిన కథలు హృదయాలకు హత్తుకునేవి ఎన్నో ఉన్నాయి. వారి సన్నిధిలో క్రూరజంతువులు తమలో తాము చంపుకోవడం, పోట్లాడుకోవడం మర్చిపోతాయి. మానవులకు ఏ హాని తలపెట్టవు. ఒక నాగుపాము ఎవరినీ ఎదిరించకుండా శ్రీరమణాశ్రమం హాలులోకి ప్రశాంతంగా వచ్చి, తన జన్మవిరోధి నెమలి ప్రక్కన మరో ఆశ్రమ సహవాసిలాగా కూర్చుంటుంది. మహర్షి ఏ జీవికైనా అపకారం తలపెట్టడం గానీ, చంపడం కానీ నిషేధించారు. ప్రతి ఒక్కరూ అవ్యక్త చేతనలో, ఆశ్రమంలో తాము సంపూర్ణ సంరక్షణలో ఉన్నామని భావిస్తూ ఉంటారు. చిన్న నల్లచారలున్న ఉడుతలు లోపలికి, బయటకు పరుగులు తీస్తూ ఉంటాయి... పక్షులు హాలు పైకప్పుల మీద గూళ్ళు కట్టుకంటాయి. కోతులు పళ్ళు దొంగిలించడానికి సమయమెప్పుడా అని తీక్షణంగా పరిశీలిస్తుంటాయి. ఆశ్రమ సహవాసియైన ఏ జంతువైనా చావుకు దగ్గరైతే, మహర్షి దగ్గర ఉండి ఒక మనిషికి ఎలా జరుగుతుందో అలానే ఉపచారాలు చేస్తూ ఉంటారు. చేతిలో చేయి వేసి చివరిక్షణం దాకా ఓదారుస్తూ ఉంటారు. బయట శరీరాలు వేరని తెలిసినా అందరిలోని ఆత్మ ఒక్కటే అన్న సత్యం తెలుసుకోవడం వలన వారిలో సమానత్వ

దృష్టి పునాదిగా ఉంటుంది. అందరిలోనూ వారు ఒకే జీవిని చూస్తారు.'' కావున జంతువులకు భగవాన్ మీద పూర్తి విశ్వాసం, వారి కరుణను అవి అనుభవించాయి. క్రూరమృగాలు, పక్షులు, కోతులు, వారి సంతానాన్ని భగవాన్ సంరక్షణలో ఉంచి వెళతాయి.

ఒక క్రూరజంతువు దాని సొంత సంతానమైనా సరే, మానవ సంపర్కం కలిగితే దాన్ని అవి బహిష్కరిస్తాయి. తమ మందలో కలవనీయవు. కానీ భగవాన్ సంరక్షణలో ఉన్న జంతువులు తిరిగి తమ మందలోకి వెళితే అవి వాటిని బహిష్కరించవు సరికదా! దానిని అవి ఎంతో గౌరవంగా భావిస్తాయి. భగవాన్ శ్రీ రమణులు తమ సంతానాన్ని ఆశీర్వదించారని అవి భావిస్తాయి.

భగవాన్ నిరంతరం మౌనంగా పవిత్ర భావనతో ఉంటారు. అక్కడ ఆగ్రహానికి తావు లేదు. వారు ఎప్పుడూ వాటిని భయపెట్టరు. అవి కూడా వారంటే ఎప్పుడూ భయపడవు. భగవాన్‌ను తమలో ఒకరు అనుకుంటాయి. అవి వారిలో తమనుతాము చూసుకొని తాదాత్మ్యం పొందుతాయి.

సర్కోమా వ్యాధివలన కలిగే నొప్పి చాలా తీవ్రంగా ఉంటుంది. భగవాన్ శరీరాన్ని వదిలి వేసే చివరి రోజు కూడా పరిచారకులను పిలిచి, పక్షులకు జంతువులకు ఆహారం పెట్టారా? అని అడిగి తెలుసుకున్నారు. అది వారికి మూగజీవాలపై గల ప్రేమ. రెండు నెమళ్ళు చెట్టుమీద ఉండి క్రేంకారాలు చేస్తుంటే, వాటికి ఆహారం పెట్టారా? అని ప్రశ్నించారు.

తెల్లనెమలి భగవాన్ నిర్యాణం చెందిన గది పైకప్పు మీద కూర్చుని, హృదయవిదారకంగా దుఃఖిస్తుంది. దాని అరుపులు విన్నవారికి గుండెలు కరిగి కన్నీరు తెప్పిస్తాయి.

మన భగవాన్ సకల జీవులకు అతి ప్రియతమ స్నేహితుడు.

నెమళ్ళు, కుక్కలు, ఉడుతలు, ఆవులు, పక్షులు, కోతులు, ఇతర క్రూరజంతువులు అన్నింటికీ ఆయన స్నేహితుడు, శ్రేయోభిలాషి, బంధువు, బోధకుడు, తండ్రి. భూమి మీద ఉన్న జీవులకు సర్వమూ తానే అన్న అనుభూతిని కలిగించారు.

## మొరార్జీదేశాయ్ సందేశం

శ్రీ రమణమహర్షి సర్వమూ తెలిసిన వారు. వారికి జంతువుల భాష తెలుసు. వారు వాటి బాధలను వింటారు. వారు ప్రతిజీవినీ ప్రేమతో చూస్తారు. అది ఒక కాకి, కుక్క, కోతి, ఆవు ఏదైనా సరే, ఒక లక్ష కోట్ల అధిపతి అయినా, భిక్షగాడైనా వారి దృష్టిలో ఒకటే.

వారు తిరువణ్ణామలై వదిలి వేరే ప్రాంతానికి వెళ్ళలేదు. వారు సందేశాలు ఇవ్వడానికి ఇష్టపడలేదు. నేను జ్ఞానినైతే, ప్రతి ఒక్కరూ జ్ఞానులే కనుక ఇంక బోధించడానికి ఏముంటుంది అనేవారు.

వారు ప్రతి జీవిని తన వలెనే భావిస్తారు. ఈ మాటలు 13-1-1979 నాడు ఢిల్లీలోని శ్రీ రమణ కేంద్రంలో జరిగిన భగవాన్ తొంభై తొమ్మిదవ జయంతి వేడుకలకు అధ్యక్షత వహించిన అప్పటి భారతదేశ ప్రధానమంత్రి మొరార్జీ దేశాయ్ చెప్పిన మాటలు.

1935లో మొరార్జీ దేశాయ్ రమణాశ్రమానికి వచ్చి భగవాన్ ముందు మౌనంగా కూర్చున్నారు. ఆయన మనసు మీద ఆ సందర్శన ఒక చెదరని, చెరగని ముద్ర వేసింది.

******

## Money, Work and Happiness

Dr K Subrahmanian

Some of you may like to know the meaning of the verse we recite at the end of our *satsang*. It is a *sloka* that is recited at the end of all functions. After doing *puja, japa, dhyana*, performing a wedding ceremony or a *shraadham*, the last verse is very often,

*na karmana ana prajayaa dhanena tyagenaike*
*amrutatva maanasuh*

Why is it recited? What does it mean? We all want to live permanently in this world, but we cannot. The body will drop away one day or the other. Whenever we remember great people for their great achievements - books, speeches, sacrifices - we feel we should also be as great as those people. Every human being wants to be considered great in some way or the other. We would like to be remembered by posterity. We want immortality, *amrutattvam*. This is a human failing, a weakness which most people have. Some become famous, and some don't. We think that we can become immortal in one way or the other. But who are the people whom we actually remember? There must have been so many rich people, great kings, etc. We don't remember all of them. In this *sloka*, it says a few people attained immortality, *amrutatva*. How?

*na karmana ana prajayaa dhanena*

They attained immortality, not by getting wealth (*dhanena)*, not by doing any kind of work (*karmana*), or through children (*prajayaa*). They became famous and attained immortality through their sacrifice, *tyaga*.

*tyagenaike amrutatva maanasuh*

They did not attain immortality through *bhoga*, but by *tyaga*; that is, renunciation. We think that by doing things, we will be rewarded; and that by doing a variety of things, we will become immortal. This verse says that it is not by doing work that we become immortal.

Almost everybody wants to work, nobody wants to remain quiet. We always criticize a person who is idle; he is one who doesn't do what he is expected to. We want him to do some work, but he goes and sees a movie instead. He is wasting his time; we would like him to spend his time usefully by doing things that we would like him to do. We expect an ordinary person to earn his livelihood. We don't want him to depend on other people for his livelihood. When he takes our money, or his parents' money, and then lives the way he wants to live, we say that he is an idle fellow. It is not that he is not doing anything, he is not doing the kind of things that we want him to. According to us, his life is not fruitful. When a person does not do the kind of work that you and I do, we say that he is a lazy fellow, and is wasting his time. This is the attitude of people all over the world.

In fact, this would be our attitude to a *jnani* if we didn't understand him. We would say a *jnani* is wasting his time. Some people used to tell Bhagavan that he was wasting his time. They used to ask, "Why don't you do something? Why are you sitting in one place? You are idle, you are lazy!" Do you have any idea how difficult it is to sit in one place even for half an hour? Movement of the body is due to the movement of the mind. Where there is *chalana* of the mind, there is *chalana* of the body. But, when we

are extraordinarily active in a way that others can't see that we are active, then, people would say that we are not doing anything. When the fan moves at top speed, we can't see its blades. We are able to see the individual blades only when the fan stops moving. When we see the extraordinary swiftness of the movement of the fan, we feel the breeze, but we don't see the blades. A *jnani* works in a similar fashion; we cannot see his actual working because he does it in a manner that you and I cannot see. He appears to be still, but like the fan, he is moving at extraordinary speed.

